
సాక్షి
సంగారెడ్డి
గురువారం । 31 । ఆగస్టు । 2023



రూ.10 లక్షల డ్రగ్స్ పట్టివేత
నిషేధిత టాబ్లెట్లు, ఇంజక్షన్లు (డ్రగ్స్) విక్రయించే ముఠాను కొల్లూరు పోలీసులు, ఎస్ఓటీ పోలీసులు, యాంటీ డ్రగ్స్ కార్డ్ ఆధ్వర్యంలో స్పెషల్ ఆపరేషన్ నిర్వహించి అరెస్టు చేశారు. 8లో



డ్రాగన్ సాగు.. లాభాలు బాగు 8లో
పంటల సాగులో పెనుమార్పులు చోటుచేసుకుంటున్నాయి. డ్రాగన్ ఫ్రూట్ పంటను అక్కన్నపేట మండలం పంతుల్ తండాకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నాడు.

ఓపెన్ డిగ్రీ అడ్మిషన్ల గడువు పెంపు
పటాన్‌చెరు టౌన్: బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ 2023–24 విద్యా సంవత్సరానికి డిగ్రీ అడ్మిషన్ల గడువు సెప్టెంబర్ 5వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభ్యాసన సహాయక కేంద్రం కోఆర్డినేటర్ యోగిబాబు బుధవారం ఓ ప్రకటన తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 7382929636 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

న్యూస్‌రీల్

గ్రామాలకు దీటుగా తండాల అభివృద్ధి

ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి



ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కార్యకర్తలు

నారాయణఖేడ్: గ్రామాలకు దీటుగా గిరిజన తండాలను అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చాప్టా(కె), కంగ్టి మండలం నాగూర్(బి), తుర్కవడ్గాం, నాగల్‌గిద్ద మండలం ఇరక్‌పల్లికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఖేడ్‌లోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లోకి చేరారు. పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఏడేళ్లలో తండాలకు రోడ్ల కోసం రూ.60 కోట్ల మంజూరు అయ్యాయన్నారు. అందులో అత్యధిక పనులు పూర్తియ్యాయయని, ఇంకొన్ని కొనసాగుతున్నాయని, మరికొన్ని టెండర్ దశలో ఉన్నాయన్నారు. 60 తండాలను పంచాయతీలుగా మార్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగీత వెంకట్‌రెడ్డి, జెడ్పీటీసీ లలిత ఆంజనేయులు, కంగ్టి, సిర్గాపూర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు గంగారాం, సంజీవరావు, మనూరు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పండరియాదవ్, ఎంపీటీసీ రాజు, సర్పంచ్ సంగమ్మ సంగప్ప, నాయకులు అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంజినీరింగ్‌కు ఉజ్వల భవిష్యత్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హుస్సేన్ తదితరులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ఆచార్య మంజూరు హుస్సేన్ అన్నారు. మండల పరిధిలోని జేఎన్‌టీయూ సుల్తాన్‌పూర్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు.. ఓరియెంటేషన్ డేను బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన, ఈపూర్ సీఐఐ చైర్మన్ అనిల్ కుమార్, పర్యావరణ కేంద్రం విభాగాధిపతిరాలు డాక్టర్ టీ విజయలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడారు. విద్యార్థులు క్యాంపస్ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనాలన్నారు. ప్రతి విద్యార్థీ కష్టపడి చదివి ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగం సంపాదించి కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో ఫార్మసీ విభాగం కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సునీతా రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వైస్ రాఘవేందర్ రావు, విభాగతిపతులు ఆచార్య బీవీ రాం నరేష్ యాదవ్, ఆచార్య పద్మావతి, ఆచార్య ప్రసన్న లక్ష్మి, ఆచార్య జోషి శ్రీపాద, ఆచార్య రజనీష్ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను వృక్షశాస్త్రం(బోటనీ)లో గెస్ట్ ఫ్యాకల్టీ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పీజీలో సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతంతో ఉత్తీర్ణత పొంది ఉండాలని సూచించారు. నెట్, స్లెట్, సెట్, పీహెచ్‌డీ వారికి ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. దరఖాస్తుదారులు అన్ని సర్టిఫికెట్స్ జిరాక్స్‌తో సెప్టెంబర్ 2న సాయంత్రం నాలుగు గంటల లోగా కళాశాలలో అందించాలని పేర్కొన్నారు. 4వ తేదీన ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు.

ఆరోగ్య సేవలకు సర్కారు కృషి

జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ

పుల్‌కల్(అందోల్): గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు విస్తరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని మంతూరు, పుల్‌కల్, లక్ష్మీసాగర్, ముదిమాణిక్యం గ్రామాల్లో ఆరోగ్య ఉపకేంద్రాల నూతన భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కేసీఆర్ ఈ రంగానికి పెద్దపీట వేస్తున్నారని అన్నారు. రాష్ట్రం ఏర్పాటు తర్వాత పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సమూల మార్పులు చోటుచేసుకున్నాయని, వైద్యసేవలు మరింత అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ప్రైవేటుకు దీటుగా ఈ రంగం పనిచేస్తోందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చైతన్య విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌చారి, వైద్య సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● నేడు సంతోషిమాతకు విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

టోల్‌గేట్ సమీపంలో ఉన్న సంతోషిమాత అమ్మవారి దేవస్థానంలో జన్మోత్సవం కార్యక్రమాన్ని గురువారం నిర్వహిస్తున్నామని ఆలయ అర్చకులు తెలిపారు. ఉదయం నాలుగు గంటలకు అభిషేకం, ఐదు గంటలకు పుష్పార్చన, అనంతరం హోమం, కుంకుమార్చన ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

– పటాన్‌చెరు టౌన్

● రాఖీ సందడి



దుకాణం వద్ద రాఖీలు కొంటున్న విద్యార్థినులు

రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా సోదరీమణులు రాఖీలు కొనుగోలు చేశారు. బుధవారం మండల కేంద్రంలోని దుకాణాల వద్ద యువతులు, విద్యార్థినులు, మహిళల సందడి కనిపించింది. గురువారం మండలంలో రాఖీ పౌర్ణమిని ఘనంగా జరుపుకొనేందుకు సిద్ధమవుతున్నారు.

– ఝరాసంగం(జహీరాబాద్)

సీఎంఆర్ టార్గెట్ పూర్తి చేయండి

అదనపు కలెక్టర్ మాధురి



సంగారెడ్డి టౌన్: రైస్ మిల్లర్లు నిర్దేశించిన గడువు లోపు ఎఫ్‌సీఐకు బియ్యం అందజేసి టార్గెట్ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ మాధురి మిల్లర్లను ఆదేశించారు. 2022–23 ఖరీఫ్ సీజన్ కు సంబంధించి కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరీ సెప్టెంబర్ 20 లోగా పూర్తి చేయాలన్నారు. బుధవారం తన చాంబర్లో పౌర సరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్షించారు. ఇప్పటివరకు పూర్తి చేసిన, ఇంకా మిగిలిన వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇప్పటివరకు 62 శాతం పూర్తి చేశారన్నారు. ఇంకా 38 శాతం పెండింగ్ ఉందని చెప్పారు. 20 రోజులలోగా ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. జిల్లా నుంచి రోజు బియ్యం చెల్లింపునకు సంబంధించి 55 (ఒక ఎంకేసీ అంటే 290 క్వింటాళ్లు)ఏసీకేలు పెట్టాలన్నారు. సమావేశంలో అధికారులు, మిల్లర్లు పాల్గొన్నారు.

సయోధ్య సాధ్యమేనా..!

- ‘ఖేడ్’ కాంగ్రెస్ పంచాయితీని తేల్చే పనిలో అధిష్ఠానం
- షెట్కార్, సంజీవరెడ్డిలకు పిలిచి మాట్లాడాలని టీపీఈసీ నిర్ణయం
- ఇప్పటికే సూత్రప్రాయంగా చర్చలు జరిపిన జహీరాబాద్ నాయకుడు
- వైఎస్సార్ ఫార్ములాను అనుసరించాలనే యోచన



సురేశ్ షెట్కార్



డాక్టర్ సంజీవరెడ్డి

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: నారాయణఖేడ్ కాంగ్రెస్‌లో ఉప్పు, నిప్పు అన్నట్లుగా ఉన్న ఇద్దరు ముఖ్య నేతల మధ్య సయోధ్య కుదుర్చేందుకు రాష్ట్ర నాయకత్వం చర్యలు చేపట్టింది. మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్, పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డిల సమన్వయానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. నేడో, రేపో తెలంగాణ ప్రదేశ్ ఎన్నికల కమిటీ (టీపీఈసీ) సభ్యులు, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావుఠాక్రే పిలిపించి మాట్లాడాలని నిర్ణయించారు. ఇప్పటికే ఇద్దరితో జహీరాబాద్‌కు చెందిన ఓ కీలక నాయకుడు చర్చలు జరిపారు. కాంగ్రెస్‌కు పట్టున్న నియోజకవర్గంలో కీచులాటలు తీవ్రనష్టాన్ని తెస్తోంది. ఒకరు పోటీలో ఉంటే మరొకరు ఇందుకు సహకరించకపోవడంతో ఇతర పార్టీలకు కలిసొస్తోంది. ఈ సమస్యను అధిగమించకపోతే వచ్చే ఎన్నికల్లో పరాజయం పునరావృతం అవుతుందని భావిస్తున్న అధినాయకత్వం.. ఇప్పటి నుంచి జాగ్రత్తగా అడుగులు వేస్తోంది.

వైఎస్సార్ ఫార్ములా ప్రయోగించేందుకు..

ఈ నియోజకవర్గంలో గతంలో సంజీవరెడ్డి తండ్రి పట్లోళ్ల కిష్టారెడ్డికి, సురేశ్‌షెట్కార్ మధ్య ఇదే పరిస్థితి ఉండేది. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అప్పట్లో వారిద్దరికి సయోధ్య కుదిర్చారు. షెట్కార్‌ను జహీరాబాద్ ఎంపీగా, కిష్టారెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకున్నారు. ఇదే ఫార్ములాను ఇప్పుడు కాంగ్రెస్ అనుసరించాలని భావిస్తోంది. ఒకరిని ఎంపీ అభ్యర్థిగా, మరొకరిని ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించాలనే యోచనలో ఉంది. వీలు కాని పక్షంలో ఒకరికి ఎమ్మెల్సీ ఇవ్వాలనే ప్రతిపాదనను తెరపైకి తెస్తోంది.

ఆసక్తికరమైన పరిణామాలు

ఖేడ్ కాంగ్రెస్‌లో ఇటీవల ఆసక్తికరమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి. సంజీవరెడ్డి.. సురేశ్ నివాసానికి వెళ్లి ఆయనతో మాట్లాడగా, ఇటీవల జరిగిన కిష్టారెడ్డి వర్ధంతి కార్యక్రమానికి షెట్కార్ కూడా హాజరుకావడం ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

తార స్థాయిలో కీచులాటలు

ఈ నియోజకవర్గంలో షెట్కార్, సంజీవరెడ్డిల మధ్య కీచులాటలు తార స్థాయిలో ఉన్నాయి. ఇక్కడ కాంగ్రెస్ రెండు వర్గాలుగా విడిపోయింది. పార్టీ కార్యక్రమాలు కూడా వేర్వేరుగా నిర్వహిస్తున్నారు. ఇటీవల మండల, పట్టణ అధ్యక్షుల నియామక విషయమై కూడా వివాదానికి దారితీసింది. షెట్కార్ అనుచరులకే అధ్యక్ష పదవులన్నీ దక్కడంపై సంజీవరెడ్డి భగ్గుమన్నారు. దీనిపై పీసీసీకి ఫిర్యాదు చేశారు. ఒకానొకదశలో గాంధీభవన్‌ను సైతం ముట్టడించాలనే యోచనలో ఉన్నట్లు ప్రచారం కూడా జరిగింది. ఇప్పుడు సమన్వయం చేయకపోతే ఈ స్థానాన్ని వదులుకోవాల్సిన పరిస్థితి తప్పదని అధినాయకత్వం భావిస్తోంది. వెంటనే సయోధ్య కుదుర్చేందుకు సన్నాహాలు చేస్తుండటం ఆసక్తి కరంగా మారింది.

మద్దతు కూడగట్టే ప్రయత్నాలు..

పార్టీ అభ్యర్థిత్వం కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్న వీరు పార్టీ ముఖ్యనేతల మద్దతును కూడగట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి షెట్కార్‌ను ప్రోత్సహిస్తుండగా, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితర ముఖ్యనేతలు సంజీవరెడ్డికి మద్దతుగా నిలుస్తున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేతో ఉన్న పరిచయాలతో ఎలాగైనా అభ్యర్థిత్వం దక్కించుకునేందుకు సురేశ్ విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇద్దరు కూడా అధినాయత్వం మద్దతును కూడగట్టుకునే ప్రయత్నాల్లో ఉండటం పార్టీ అంతర్గత వర్గాల్లో ఆసక్తికరమైన చర్చకు దారితీస్తోంది. ఒకవేళ సయోధ్య కుదిరినప్పటికీ, వచ్చే ఎన్నికల్లో మనస్ఫూర్తిగా పని చేస్తారా? లేదా? అనేది ఎన్నికల ఫలితాల వరకు వేచి చూడాల్సిందే.

మొక్కలకు జియో ట్యాగింగ్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

అధికారులకు కలెక్టర్ శరత్ దిశానిర్దేశం

సంగారెడ్డి టౌన్: ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను వేగవంతం చేయాలని కలెక్టర్ శరత్ శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హరితహారంలో నాటిన మొక్కలన్నింటికీ వంద శాతం జియో ట్యాగింగ్ చేయాలన్నారు. లక్ష్యం మేరకు సంపద వనాలు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆసరా స్పౌస్ పెన్షన్ల పంపిణీకి చర్యలు తీసుకోవాలని చెప్పారు. రెండో విడతలో బీసీ కుల వృత్తుల వారికి, మైనార్టీ లబ్ధిదారులకు లక్ష రూపాయల ఆర్థిక సాయం చెక్కుల పంపిణీని పూర్తి చేయాలన్నారు. కల్యాణ లక్ష్మి చెక్కులు పెండింగ్లో ఉండకూడదన్నారు. గొర్రెల పంపిణీ వేగవంతం చేయాలని, ప్రతి వారం 150 యూనిట్లు ఇవ్వాలని సూచించారు. దళిత బంధు రెండో విడత వెరిఫికేషన్ పూర్తి చేయాలన్నారు. ఓరియెంటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారికి సూచించారు. గృహలక్ష్మి అర్హుల జాబితాను రేపటి లోగా అప్‌లోడ్ చేయాలని అన్నారు. ఇళ్ల పట్టాల పంపిణీ పూర్తి చేయాలని రెవెన్యూ డివిజన్ అధికారులకు సూచించారు. సమీక్షలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీపీఓ సురేష్ మోహన్, బీసీ సంక్షేమ అధికారి జగదీశ్, మైనార్టీ సంక్షేమ అధికారి దేవుజా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాస రావు, పశు సంవర్ధక శాఖ జెడీ వసంతకుమారి, వ్యవసాయ శాఖ జేడీ నరసింహారావు, హౌసింగ్ నోడల్ అధికారి తుమ్మ ప్రసాద్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పుట్టి మునగడం తథ్యం

- బీసీ టికెట్ల కేటాయింపులో అన్యాయం
- సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

సంగారెడ్డి మున్సిపాలిటీ: బీఆర్ఎస్ టికెట్ల కేటాయింపులో బీసీలకు అన్యాయం జరిగిందని ఆ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. 60 శాతం ఉన్న బీసీలకు 20 శాతం టికెట్లు కేటాయింపా? అని ప్రశ్నించారు. అర శాతం ఉన్న వెలమలకు 16, ఐదు శాతం ఉన్న రెడ్లకు 33, తొమ్మిది శాతం ఉన్న అగ్రకులాలకు 54 శాతమా? అని నిలదీశారు. ఆ పార్టీ పుట్టి మునగడం ఖాయన్నారు. బుధవారం పట్టణంలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన బీసీ కుల సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. మరోసారి బీసీ ద్రోహి అని కేసీఆర్ నిరూపించుకున్నారని మండిపడ్డారు. గతంలో కంటే తక్కువగా 23 టికెట్లు కేటాయించి అవమాన పరిచారన్నారు. చిత్తశుద్ధి లేదనడానికి ఇదే నిదర్శనం అన్నారు. వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. రెడ్లకు, వెలమలకు పెద్దపీట వేసి టీఆర్ఎస్ అంటే.. రెడ్ల, వెలమల సమితిగా మారిందని ఎద్దేవా చేశారు. 115 అభ్యర్థుల్లో 65 మంది అగ్రకులాలకు టికెట్లు ఇవ్వడం సరికాదన్నారు. కేవలం బీసీలనే కారణంగా సీఎం పక్కన పెట్టడం ఏమిటని అడిగారు. రెండు రోజుల్లో అన్యాయానికి గురైన అభ్యర్థులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. తర్వాత కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. వచ్చేనెల 10న హైదరాబాద్లో బీసీల సింహగర్జన మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సొంతింటి కల సాకారం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- తొలి విడతలో 500 మంది లబ్ధిదారుల ఎంపిక
- హాజరైన కలెక్టర్ శరత్




కలెక్టర్ శరత్‌తో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించి, వారి జీవితాల్లో నూతన వెలుగులు నింపిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీపీ సమావేశ మందిరంలో మొదటి విడత లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమాన్ని కలెక్టర్ శరత్, ఎమ్మెల్యే సమక్షంలో నిర్వహించారు. ప్రత్యేకమైన సాంకేతిక పరిజ్ఞానంతో.. అర్హులైన 4,132 మంది జాబితాను రాండమైజేషన్ పద్ధతిలో 500 మందిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. నిరుపేదలు ఆత్మగౌరవంతో జీవించాలన్న సమున్నత లక్ష్యంతో అన్ని వసతులతో కూడిన ఇళ్లను ప్రభుత్వం నిర్మించిందన్నారు. నియోజకవర్గ పరిధిలోని కొల్లూరు, ఉస్మాన్ నగర్, అమీన్‌పూర్ పరిధిలో నిర్మించిన 30 వేలకు పైగా గృహాల్లో.. పటాన్‌చెరుకు నాలుగు వేలను కేటాయించిందని అన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని భారతినగర్, పటాన్‌చెరు, రామచంద్రాపురం డివిజన్ల పరిధిలో 9,900 మంది దరఖాస్తు చేసుకుంటే 4,132 మందిని అర్హులుగా గుర్తించామన్నారు. మిగతా లబ్ధిదారులకు విడతలవారీగా లాటరీ పద్ధతిన కేటాయిస్తామని స్పష్టం చేశారు. ఆయా గ్రామాల రెవెన్యూ పరిధిలో నిర్మించిన వాటిలో 2 వేలను స్థానికులకు కేటాయిస్తామని వెల్లడించారు. పట్టణంలోని జేపీ కాలనీకి చెందిన శ్రీలక్ష్మికి ఎమ్మెల్యే స్వయంగా ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ శరత్ మాట్లాడుతూ పూర్తి పారదర్శకతతో ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఆర్డీవో రవీందర్ రెడ్డి, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

283 టీచర్ పోస్టులకు గ్రీన్‌సిగ్నల్

- జిల్లాలో విద్యా శాఖ గుర్తించిన ఖాళీల సంఖ్య 682

ప్రభుత్వం ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి పచ్చజెండా ఊపింది. టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్‌టీ) ద్వారా సాధారణ ఉపాధ్యాయ ఖాళీలతోపాటు ప్రత్యేక అవసరాల పిల్లలకు సంబంధించిన ఖాళీలు భర్తీ చేస్తామని విద్యాశాఖ మంత్రి ప్రకటించడంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇన్నాళ్లు ఉపాధ్యాయ నియామక పరీక్ష ఉంటుందా? లేదా? అన్న మీమాంస నేపథ్యంలో డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేస్తామని ప్రకటించడంతో అభ్యర్థుల్లో ఆశలు రేకెత్తిస్తోంది.



కొండాపూర్(సంగారెడ్డి): జిల్లాలో 1,265 పాఠశాలలున్నాయి. వీటిలో ప్రాథమిక 863, ప్రాథమికోన్నత 191, ఉన్నత పాఠశాలలు 211 ఉన్నాయి. కాగా 682 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలున్నట్లు అధికారులు గుర్తించారు. విద్యాశాఖ మాత్రం 283 ఖాళీలను మాత్రమే భర్తీ చేయనుంది. ప్రకటనను చూస్తే జిల్లాలో ఇప్పటికే మంజూరై ఉన్న అన్ని పోస్టులను కూడా భర్తీ చేయడం లేదని స్పష్టంగా అర్థమవుతోంది.

సర్దుబాటుతో వెళ్ల దీస్తూ

జిల్లాలోని 1,265 పాఠశాలలకు గానూ అనేక చోట్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ విద్యాసంవత్సరం జిల్లావ్యాప్తంగా 220 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. తెలంగాణ ఏర్పడిన తరువాత కేవలం ఒకసారి మాత్రమే టీఆర్‌టీ ప్రకటన విడుదలైంది. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని, ఎన్నో రకాలుగా ఉద్యమాలు చేపట్టిన ఫలితం లేకపోయింది.

ఉపాధ్యాయ ఖాళీల వివరాలు

పోస్టులు	ఖాళీలు	భర్తీ చేస్తున్నవి
ఎస్ఏ	286	80
ఎస్‌జీటీ	385	174
ఎల్‌పి	24	24
పీఈటీ	5	5
మొత్తం	682	283

ఏళ్లుగా నిరీక్షణ

గతంలో ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన 2017లో టీఆర్‌టీ నిర్వహించారు. ఆ తరువాత ఉపాధ్యాయ నియామకాలు లేకపోవడంతో ప్రభుత్వం ఎలాగైన టీచర్ పోస్టులను భర్తీ చేస్తుందనే ఆశతో ప్రతి సంవత్సరం బీఎడ్, డీఎడ్ కోర్సుల్లో చేరే వారి సంఖ్య ఎక్కువ అవుతోంది. టీఆర్‌టీ పరీక్ష రాయాలంటే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) అర్హత సాధించాల్సి ఉండడంతో ప్రభుత్వం ఇటీవల టెట్ నోటిఫికేషన్ సైతం విడుదల చేసింది. సెప్టెంబర్ 15న టెట్ అర్హత పరీక్ష, ఫలితాలు 27న ప్రకటించనుంది.

ప్రభుత్వ ఆధీనంలోనే విద్యావ్యవస్థ

- ఈ రంగంపై నిర్లక్ష్యం తగదు
- బకాయి స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి
- పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పరశురాం



మాట్లాడుతున్న పరశురాం

కొండాపూర్(సంగారెడ్డి): జాతీయ విద్యావిధానంతో విద్యావ్యవస్థ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతుందని, ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పరశురాం అన్నారు. బుధవారం పట్టణంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రంగాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. అధిక నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తూ సమస్యల్లోకి నెట్టివేస్తోందని ఆరోపించారు. మూడేళ్ల నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ రూ. 5,500 కోట్ల బకాయిలు విడుదల చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. ఈ రంగం బాగుపడాలంటే సుమారుగా ఖాళీగా ఉన్న 20 వేల పోస్టులను ఉపాధ్యాయులతో భర్తీ చేయాలన్నారు. కానీ ఆరు వేలకే నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. ఇది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడటమేనని విమర్శించారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయం ఎదుట బుధవారం శాంతియుతంగా నిరసన చేస్తున్న బీఈడీ, డీఎడ్ అభ్యర్థులపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీఛార్జి చేయటం సిగ్గు చేటన్నారు. కేజీ టు పీజీ ఉచిత విద్య అందిస్తానని హామీలిచ్చి కేవలం కొన్ని గురుకుల పాఠశాలలను హడావుడిగా అద్దె భవనాల్లో ప్రారంభించడం సరికాదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి నరసింహ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గంజి హర్షిత్, జిల్లా కోశాధికారి శ్రీకాంత్, నాయకులు సందీప్, అర్జున్, సాయికుమార్, ప్రదీప్ కుమార్, వంశీ, నవీన అర్చన శ్రీనిధి, అనూష, నవనీత, గౌరీ ప్రియ, భవ్య, సౌమ్య, మౌనిక, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అక్షయపాత్ర వాహనం బోల్తా



రోడ్డు పక్కన బోల్తాపడిన బొలేరో

వెల్దుర్తి(తూప్రాన్): మండల పరిధిలోని ఉప్పు లింగాపూర్ గ్రామ శివారులో వాహనం బోల్తా పడింది. బుధవారం సంగారెడ్డి నుంచి బొలేరో వాహనంలో అక్షయపాత్ర భోజనం తీసుకొచ్చి వెల్దుర్తి పాఠశాలలో అందజేశారు. అక్కడి నుంచి చిన్నశంకరంపేట మండలం దర్పల్లి పాఠశాలకు వెళ్తుండగా ఉప్పులింగాపూర్ శివారులోని మూలమలుపు వద్ద వాహనం బోల్తా పడింది. అందులోని భోజనమంతా నేలపాలైంది. బీటీ రోడ్డు నిర్మాణం కోసం వేసిన కంకర వల్ల వాహనం అదుపుతప్పినట్లు తెలుస్తోంది.

బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడిగా అనిల్ రెడ్డి



నియామక పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే

దుబ్బాక: దుబ్బాక మండలం అచ్చుమాయిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు మంద అనిల్‌రెడ్డి బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడిగా నియామకమయ్యారు. ఈ మేరకు దుబ్బాక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆయనకు నియామక పత్రాన్ని అందించి సన్మానించారు. ఈ సందర్భంగా అనిల్‌రెడ్డి మాట్లాడుతూ..తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి ప్రత్యేక కృతజ్ఞతలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవి రెడ్డి, సుభాష్‌రెడ్డి, శ్రీనివాస్, రమేష్ రెడ్డి, నేహాల్‌గౌడ్ ఉన్నారు.

మోటార్ సైకిళ్లను అందించాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సిద్దిపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా కార్మికులకు మోటార్ సైకిళ్లను అందివ్వాలని బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ అన్నారు. బుధవారం ఫెడరేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు రాజు, జిల్లా సహాయ కార్యదర్శి పోతిరెడ్డి రాజు, కమిటీ సభ్యులు బాలయ్య యాదయ్య, అంతయ్య, మహేందర్, శ్రీనివాస్, సత్యం, బాబు, నర్సవ్వ పాల్గొన్నారు.

డ్రాగన్ సాగు.. లాభాలు బాగు

- తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం
- మార్కెట్‌లో భలే డిమాండ్
- ఆసక్తి చూపుతున్న రైతులు



హుస్నాబాద్: పంటల సాగులో పెనుమార్పులు చోటుచేసుకుంటున్నాయి. సంప్రదాయ పంటలే కాకుండా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వాటిని సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. విదేశాల్లో అధికంగా పండించే డ్రాగన్ ఫ్రూట్ పంటను అక్కన్నపేట మండలం పంతుల్ తండాకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి దుద్యానాయక్ సాగుచేస్తూ లాభాలు గడిస్తున్నాడు.

దుద్యానాయక్‌కు వారసత్వంగా రెండున్నర ఎకరాలు వచ్చింది. గతంలో వర్షాధార పంటలైన మొక్కజొన్న, పత్తి పంటలు సాగు చేసేవాడు. సరిగా నీరు అందక నష్టాలు చవిచూసేవాడు. ఆ సమయంలో డ్రాగన్ ఫ్రూట్ పంట గురించి తెలుసుకున్నాడు. సాగు విధానం, పెట్టుబడి ఖర్చు, వచ్చే ఆదాయం గురించి క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. దీని ద్వారా అధిక లాభాలు పొందవచ్చని భావించి డ్రాగన్ ఫ్రూట్ సాగుకు పూనుకున్నాడు. ఐదేళ్ల నుంచి పంట పండిస్తున్నాడు. రెండేళ్ల నుంచి ఆయన దిగుబడి పొందుతున్నాడు.

2 వేల మొక్కలు.. 500 సిమెంట్ స్తంభాలు

డ్రాగన్ ఫ్రూట్‌ను అన్ని రకాల నేలల్లో సాగు చేసుకోవచ్చు. పంటకు నీళ్ల అవసరం కూడా చాలా తక్కువగా ఉంటుంది. ఈ పంట తీగలాగా ఎదుగుతుంది. ఈ పంటను రెండున్నర ఎకరాల్లో సాగు చేస్తే 500 సిమెంట్ స్తంభాలు అవసరం ఉంటుంది. వాటి పొడవు 7 ఫీట్లు ఉండాలి. స్తంభానికి నాలుగు చొప్పున మొత్తం 2వేల మొక్కలు నాటుతారు. స్తంభాల మధ్య 9 ఫీట్ల దూరం ఉండాలి. సిమెంట్ స్తంభానికి రూ.250, పైన టైర్, సిమెంట్ రింగ్ రూ.100, మొక్క కొనుగోలుకు రూ.106 చొప్పున ఖర్చు అవుతుంది. ప్రతీ ఏడాది జూన్ నెల నుంచి 5 నెలల వరకు పంట దిగుబడి వస్తుంది. మొక్క పెరుగుతున్నా కొద్దీ కాండం పక్కకు పోకకుండా ఎప్పటికప్పుడు కట్ చేస్తూ ఉండాలి.



డ్రాగన్ ఫ్రూట్ సాగు

సేంద్రియ ఎరువులతో మేలు

డ్రాగన్ ఫ్రూట్ పంటకు సేంద్రియ ఎరువుల వాడకం వల్ల ఉపయోగం ఉంటుంది. ఆవు పేడలో వరి కంపోస్ట్‌ను మిశ్రమంగా చేసి పంటకు వేస్తారు. ఏదైనా చీడ పురుగు సోకితే వేప నూనె పడతారు. డ్రిప్ ద్వారా నాలుగు రోజులకు ఒకసారి పంటకు నీటిని అందిస్తారు. డ్రాగన్ పంటకు కీటకాలు, పక్షులు, జంతువుల బెడద ఉండదు. ఇవేవి ఆ పంట దరిచేరవు.

మార్కెట్‌లో మంచి గిరాకీ

రెండు రకాల డ్రాగన్ ఫ్రూట్స్ ఉంటాయి. తెలుపు, పింక్ కలర్‌లో ఉంటాయి. పింక్ పండు రుచికరంగా ఉంటుంది. విదేశాల్లో మంచి డిమాండ్ ఉన్న డ్రాగన్ ఫ్రూట్‌కు దేశీయంలో కూడా దీనిని తినడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. సీజన్‌లో ఒక్కో చెట్టుకు దాదాపు 70 నుంచి 80 పండ్లు కాస్తాయి. వరంగల్, సిద్దిపేట, కరీంనగర్ మార్కెట్లలో కిలో పండు రూ.200 చొప్పున అమ్ముడుపోతుంది. ఈ లెక్కన 2 వేల చెట్లకు లక్షల రూపాయల్లో ఆదాయం వస్తుంది. ఒక పండు 250 గ్రాముల నుంచి 300 గ్రాముల బరువు ఉంటుంది. మార్కెట్‌లో ఒక పండుకు రూ.150 నుంచి 200 వరకు ధర ఉంటుంది.

ఔషధ గుణాలు పుష్కలం

డ్రాగన్ ఫ్రూట్స్‌లో ఔషధ గుణాలు అధికంగా ఉంటాయి. ప్రొటీన్లు ఎక్కువగా ఉండి ఇమ్యూనిటీ పవర్‌ను పెంచుతుంది. రక్తంలోని అనవసరపు కొవ్వును తీస్తూ హిమోగ్లోబిన్ పెంచుతుంది. శరీరంలో చక్కెర శాతాన్ని అదుపులో ఉంచుతుంది. ప్లేట్‌లేట్స్ తగ్గినప్పుడు మంచి ఔషధంగా డ్రాగన్ పని చేస్తుంది. మలబద్ధకం, క్యాన్సర్ వంటి వ్యాధులకు కూడా ఈ పండు గొప్ప ఔషధంగా పని చేస్తుంది. కరోనా వ్యాధి నివారణకు డ్రాగన్ ఫ్రూట్స్ ఎంతగానో ఉపయోగపడుతుంది. కరోనా సమయంలోనే దీని విశిష్టత గురించి అందరికీ తెలిసింది.



పంట లాభదాయకం

మొక్కజొన్న, పత్తి పంటలు వేస్తే నీళ్ల సరిపోక నష్టం వచ్చేది. డ్రాగన్ ఫ్రూట్ పంట వివరాలు తెలుసుకొని రెండున్నర ఎకరాలలో సాగు చేశాను. కూలీలు లేకుండా కుటుంబ సభ్యులతో పంట వేశాను. రెండేళ్ల వరకు ఆశించిన దిగుబడి లేక ఆదాయం రాలేదు. తర్వాత దిగుబడి పెరిగింది. సేంద్రియ ఎరువుకు తప్ప ఖర్చు లేదు. ఏడాదికి దాదాపు 2లక్షలకు పైగా ఆదాయం వస్తుంది. పంట మొదలు పెట్టి దాదాపు ఐదేళ్లు కావొస్తుంది. మార్కెట్‌లో ఒక పండు రూ.150 నుంచి రూ.200 వరకు అమ్ముడుపోతుంది.



– దుగ్యానాయక్, ప్రభుత్వ ఉద్యోగి, పంతుల్‌తండా, అక్కన్నపేట మండలం

ఇద్దరు అదృశ్యం

మిరుదొడ్డి(దుబ్బాక): మహిళ అదృశ్యమైన కేసు బుధవారం భూంపల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదైంది. ఎస్‌ఐ భువనేశ్వర్ రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కేశపాక కనకవ్వ, లింగం దంపతులకు కూతురు మమత, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆరేళ్ల క్రితం చేగుంట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన ఆపర్ల కుమార స్వామితో మమతకు వివాహమైంది. వీరికి ఇద్దరు కొడుకులు. కొంత కాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. కొద్దిరోజుల క్రితం భర్తతో గొడవపడి బంధువుల ఇంటికి వెళ్లింది. పది రోజుల తర్వాత తిరిగి అత్తగారింటికి వచ్చింది. అప్పట్లో ఈ విషయంపై చేగుంట పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టగా మమతకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. అప్పటి నుంచి మమత పుట్టిల్లు వీరారెడ్డిపల్లిలోని తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. పది రోజుల క్రితం ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లిన మమత తిరిగి రాలేదు. బంధువుల వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదు. ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



మమత(ఫైల్)

విద్యార్థి..

సంగారెడ్డి మున్సిపాలిటీ: విద్యార్థి అదృశ్యమైన కేసు సంగారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని అయ్యప్ప కాలనీకి చెందిన మఠం కార్తీక్ (18) బుధవారం ఉదయం వాకింగ్ కోసమని బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా దొరకలేదు. దీంతో కుటుంబ సభ్యులు సంగారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 08455276333 , 8712656718 నెంబర్లకు తెలపాలని కోరారు.



మఠం కార్తీక్(ఫైల్)

వన్యప్రాణుల వేటగాళ్లు అరెస్ట్

నాటు తుపాకీ, మందుగుండు సామగ్రి స్వాధీనం

నారాయణఖేడ్: అటవీ ప్రాంతంలో కుందేళ్లను వేటాడేందుకు నాటుతుపాకీతో సంచరిస్తున్న ఇద్దరిని గ్రామస్థులు పట్టుకొని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. నారాయణఖేడ్ ఫారెస్టు రేంజ్ అధికారి కె.చంద్రశేఖర్ తెలిపిన వివరాలు. నారాయణఖేడ్ మండలంలోని సంజీవన్‌రావుపేట్ శివారులో కొన్నేళ్లుగా పొలాల వద్ద బోర్లకు సంబంధించిన స్టార్టర్లు చోరీకి గురవుతున్నాయి. దీంతో రాత్రి వేళల్లో రైతులు పహారా కాస్తున్నారు. మంగళవారం రాత్రి కల్హేర్ మండలం కృష్ణాపూర్ పంచాయతీ పరిధిలోని మెట్టుకుంట తండాకు చెందిన నేనావత్ రాములునాయక్, నేనావత్ జైపాల్ నాటు తుపాకీతో సంజీవన్‌రావుపేట్ అటవీప్రాంతంలో కుందేళ్లు, వన్యప్రాణులను వేటాడేందుకు వచ్చారు. వారిని రైతులు పట్టుకొని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. వీరి నుంచి నాటుతుపాకీ, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై అటవీ చట్టం సెక్షన్- 21 ప్రకారం కేసు నమోదు చేసి స్థానిక కోర్టులో హాజరుపరిచినట్లు ఫారెస్టు రేంజ్ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. నాటుతుపాకులతో ఎవరైనా సంచరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అటవీశాఖ కల్హేర్ సెక్షన్ అధికారి ధన్‌సింగ్, మాద్వార్ బీట్ అధికారి దిగంబర్ పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న నాటుతుపాకీ, అధికారుల అదుపులో నిందితులు

రూ.10 లక్షల డ్రగ్స్ పట్టివేత

పోలీసుల స్పెషల్ ఆపరేషన్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నిషేధిత టాబ్లెట్లు, ఇంజక్షన్లు (డ్రగ్స్) విక్రయించే ముఠాను కొల్లూరు పోలీసులు, ఎస్‌ఓటీ పోలీసులు, యాంటీ డ్రగ్స్ కార్డ్ సంయుక్త ఆధ్వర్యంలో స్పెషల్ ఆపరేషన్ నిర్వహించి అరెస్టు చేశారు. ఈ సంఘటన బుధవారం కొల్లూరులో జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు మియాపూర్ ఏసీపీ నరసింహారావు వెల్లడించారు. అహ్మద్ బిన్ అబ్దుల్ ఖాదర్ నగరంలోని చాంద్రాయణగుట్టలో జిమ్ నిర్వహిస్తుంటాడు. ఇందులో సరైన ఆదాయం లేకపోవడంతో మహ్మద్ ఇబ్రహీంతో కలిసి శరీర దృఢత్వాన్ని పెంచే నిషేధిత డ్రగ్స్ విక్రయించడం మొదలుపెట్టారు. వీరు కొల్లూరు ప్రాంతంలో సంచరిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు. శరీర దృఢత్వం పెరిగే టాబ్లెట్స్ కావాలంటూ వారి వద్దకు మఫ్టీలో వెళ్లారు. వాటిని కొనుగోలు చేస్తామని మభ్యపెట్టి వివరాలు సేకరించారు. ఈ క్రమంలో అహ్మద్ బిన్ అబ్దుల్ ఖాదర్, మహ్మద్ ఇబ్రహీంలను అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా జిమ్‌లో ఉన్న నిషేధిత డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాటిని పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించారు. పోలీసుల విచారణలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. శరీర దృఢత్వం పెంపొందించే డ్రగ్స్ సీసాను రూ.300కు కొనుగోలు చేసి వాటిని రూ.వెయ్యి నుంచి రూ.1400కు అమ్ముతున్నారు. వీటిలో పశువులకు వాడే టాబ్లెట్లు, ఇంజక్షన్లు ఉండటం విశేషం. వీటిని ఉపయోగిస్తే త్వరగా అనారోగ్యానికి గురవడంతోపాటు గుండెపోటు వచ్చే అవకాశం ఉంటుంది. వీటిని నిందితులకు నగరంలోని గాజుల దుకాణదారుడు, మీసేవ నిర్వాహకుడు సరఫరా చేస్తున్నట్లు విచారణలో తేలింది. త్వరలోనే డ్రగ్స్ సరఫరా చేసేవారిని పట్టుకుంటామని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో హైదరాబాద్ డ్రగ్స్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ రాజమౌళి, కొల్లూరు సీఐ సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ నరసింహారావు



స్వాధీనం చేసుకున్న నిషేధిత మందులు

అభివృద్ధి అంటే భూములు అమ్ముకోవడమా?

బీజేపీ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్

కొండాపూర్(సంగారెడ్డి): గజ్వేల్ నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి శూన్యమని, త్వరలో జరిగే ఎన్నికల్లో ఆయనను ఓడించేందుకు ప్రజలు ఎంతో ఆత్రంగా ఎదురుచూస్తున్నారని బీజేపీ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పేర్కొన్నారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గజ్వేల్‌లో దళితులకు ఒక ఎకరా భూమి కూడా ఇవ్వని కేసీఆర్, గత ప్రభుత్వాలు ఇచ్చినా అసైన్డ్ భూమిని లాక్కొని కార్పొరేట్ శక్తులకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. అభివృద్ధి అంటే భూములు అమ్ముకోవడమేనా అని ప్రశ్నించారు?. గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు కేసీఆర్ ఏనాడూ అందుబాటులో ఉన్నది లేదన్నారు. గజ్వేల్‌లో సీఎం ఓడిపోతారని పలు సర్వేలు చెప్పడంతోనే కామారెడ్డిలోనూ పోటీ చేస్తున్నారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో గెలిచేది లేదన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఇతర పార్టీలోకి వెళ్తున్నారనే ముందస్తు సమాచారం ఉండడంతో.. మళ్లీ వారికే సీట్లు కేటాయించారని తెలిపారు. దళితబంధు పథకంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అవినీతికి పాల్పడుతున్నారని, ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ.3 లక్షలు తీసుకుంటున్నారని సీఎం కేసీఆర్ స్వయంగా ప్రకటించడం దారుణమన్నారు. ప్రజలు తిరస్కరిస్తున్న అభ్యర్థులకు టికెట్లు కేటాయించారని, వారు గెలిచే పరిస్థితి లేదన్నారు. నిరుద్యోగ భృతి, ఉద్యోగాల కల్పన, డబుల్ బెడ్ రూంల హామీలు ఏమయ్యాయన్నారు. కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అమలుకు నోచని హామీలు ఇచ్చి మళ్లీ గెలవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దళితబంధు, బీసీబంధు అంటూ కొత్త తాయిలాలను ప్రకటిస్తున్నారని, వాటి పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కుటుంబపాలన, లంచగొండితనం, సొంతింటి కల నెరవేర్చని ప్రభుత్వం పోవాలంటే బీజేపీకి ఓటు వేయాలని కోరారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రతీ కార్యకర్త కేసీఆర్ అవినీతి, కుటుంబ పాలన గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకులు ప్రేమేందర్ రెడ్డి, సంగప్ప, రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

ఓటమి భయంతోనే రెండుచోట్ల పోటీ

కేసీఆర్‌కు ఓటమి భయం మొదలైందని, అందులో భాగంగానే గజ్వేల్, కామారెడ్డిలో పోటీచేస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆరోపించారు. బుధవారం సంగారెడ్డి జిల్లా కందిలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రెండూ ఒకటేనని.. 2014, 2019 ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌లోకి వెళ్లిన విషయాన్ని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో కూడా అదే పునరావృతం అవుతుందని చెప్పారు. ఇటీవల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కుక్కలతో పోల్చడాన్ని తప్పుబట్టారు. మరో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కూడా కాంగ్రెస్‌లో బీఆర్‌ఎస్ కోవర్టులు ఉన్నారని, త్వరలో జరిగే ఎన్నికల్లో ఆ పార్టీలో గెలిచిన వారు కూడా బీఆర్‌ఎస్‌లోనే చేరతారని చెప్పడం చూస్తే రెండు పార్టీల రహస్య ఒప్పందం స్పష్టంగా అర్థమవుతుందని చెప్పారు. కేసీఆర్‌కు స్పష్టమైన మెజార్టీ రాకపోతే కాంగ్రెస్‌లో గెలిచిన ఎమ్మెల్యేలను తీసుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారన్నారు. పొరపాటున కూడా కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు ఓటు వేయకూడదని ప్రజలకు ఈటల విజ్ఞప్తి చేశారు.

మోటార్ కోసం మంజీరాలోకి దిగి..

- వ్యక్తి మృత్యువాత
- నంగాయిపేటలో ఘటన

కొల్చారం(నర్సాపూర్): మంజీరా నదిలో నుంచి మోటార్‌ను బయటకు తీసే ప్రయత్నంలో ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతిచెందిన ఘటన మండలంలోని సంగాయిపేట గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎండబెట్ల మల్లేశం గౌడ్ మంజీరానది సమీపంలోని లిఫ్ట్ పక్కన పంట సాగు కోసం మోటారును ఏర్పాటు చేశాడు. మంగళవారం మోటార్ కాలిపోవడంతో దానిని నదిలో నుంచి బయటకు తీసేందుకు మంగలి గోపాల్(42)ను వెంట తీసుకెళ్లాడు. మల్లేశంగౌడ్ నది ఒడ్డుపై ఉండగా, గోపాల్ మోటార్ పైపు ద్వారా నదిలోకి దిగాడు. అతను ఎంతసేపటికి పైకి రాకపోవడంతో మల్లేశంగౌడ్ గ్రామస్తులకు సమాచారం అందించాడు. గోపాల్ కోసం నది చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో గ్రామస్తుల సమాచారం మేరకు కొల్చారం ఎస్‌ఐ గౌస్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానిక గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. ఐదు గంటల తర్వాత నదిలో మృతదేహం లభ్యమైంది. మోటారుకు ఎర్తింగ్ వచ్చి విద్యుదాఘాతంతో గోపాల్ చనిపోయి ఉండవచ్చని గ్రామస్తులు భావించారు. మృతుని భార్య కమలమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



గోపాల్ (ఫైల్)

తీరు నచ్చక తండ్రిపై కుమారుల దాడి

తలకు తీవ్రగాయంతో మృతి

దుబ్బాకరూరల్: కుమారులు దాడి చేయడంతో తండ్రి మృతి చెందిన సంఘటన మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ గంగరాజ్ వివరాలు. గ్రామానికి చెందిన చింతల తిరుపతి(50) స్థానికంగా ఓ మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. ఇదే విషయంపై వారి కుటుంబంలో చాలాసార్లు గొడవలు జరిగాయి. అయినా తిరుపతి ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈనెల 29న మధ్యాహ్నం మహిళను బైక్‌పై ఎక్కించుకుని సిద్దిపేట వైపు వెళ్తున్న తిరుపతిని కుమారులు గణేష్, భాస్కర్‌లు గమనించారు. రాంచంద్రనగర్ వద్ద బండిని ఆపడానికి ప్రయత్నించగా తప్పించుకుని వెళ్లి పోయాడు. అదేరోజు రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఇంటికి చేరుకున్నాడు. సదరు మహిళతో ఎందుకు తిరుగుతున్నావని కుమారులు, భార్య ఐలమ్మ నిలదీశారు. మాట మాట పెరగడంతో గణేష్ తన తండ్రిని నెట్టేయడంతో సిమెంట్ ర్యాంప్‌పై పడి తలకు తీవ్ర గాయమైంది. అతన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బుధవారం మృతుని సోదరుడు చింతల రాజలింగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుమారులు, భార్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



తిరుపతి(ఫైల్)

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

గజ్వేల్‌రూరల్: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన గజ్వేల్‌లో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు. పట్టణానికి చెందిన వేణుమాధవ్(36)కు భార్య, రెండేళ్లలోపు ఇద్దరు కవల అమ్మాయిలు ఉన్నారు. మంగళవారం ఉదయం ఇంట్లోంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. బుధవారం సాయంత్రం ఎర్రకుంటలో యువకుడి మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని బయటకు తీశారు. మృతుని వద్ద లభించిన గుర్తింపు పత్రాల ఆధారంగా వేణుమాధవ్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఇతను పలు దినపత్రికలలో విలేకరిగా పనిచేశాడని, వ్యాపారాల్లో నష్టాలు రావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. కొంతకాలంగా అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురవుతున్నట్లు తెలిపారు. గతంలోనూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంటినుంచి వెళ్లిపోయినట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ప్రధాన కార్యదర్శి కే. విరాహత్ అలీ, మిత్రులు సంతాపం వ్యక్తం చేశారు.



వేణుమాధవ్ (ఫైల్)

జాతీయస్థాయి సైక్లింగ్‌కు..



మెమొంటో అందుకుంటున్న హర్షవర్ధన్ సాయి

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల పరిధి రామవరం ప్రభుత్వ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న కె.హర్షవర్ధన్ సాయి జాతీయస్థాయి సైక్లింగ్‌కు ఎంపికైనట్లు కోచ్ సంజీవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రిటైర్డ్ పీడీ, హ్యాండ్ బాల్ కోచ్ కనకయ్య, డీవైఎస్‌ఓ నాగేందర్, స్ఫూర్తి లయన్స్ క్లబ్ సిద్దిపేట డైరెక్టర్ సోమ కైలాస పతి, సత్యనారాయణ, ఈశ్వర్‌చరణ్ విద్యార్థికి మెమొంటోలు, సర్టిఫికెట్స్ అందజేశారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

రామాయంపేట(మెదక్): అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పర్వతాపూర్ పంచాయతీ పరిధిలోని బాపనయ్య మోతుకుల తండాలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. తండాకు చెందిన దేవిసింగ్ (28) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుంటాడు. అప్పుల బాధతో క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



దేవిసింగ్ (ఫైల్)

రైలు కిందపడి..

చేగుంట(తూప్రాన్): రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రం మాసాయిపేటలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, రైల్వే పోలీసుల వివరాలు. కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లా కాలేరు గ్రామానికి చెందిన బసవరాజ్(22) ద్విచక్రవాహనంపై మాసాయిపేటకు వచ్చాడు. బైకును రైల్వే స్టేషన్ సమీపంలో నిలిపి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో కామారెడ్డి రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వరలక్ష్మి సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బంధువులకు సమాచారం అందించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి రైల్వే ఆస్పత్రికి తరలించారు.



బసవరాజ్ (ఫైల్)

విద్యార్థిని..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఓ విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం రాత్రి రామచంద్రాపురంలో జరిగింది. పోలీసుల వివరాలు. పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో నివాసముండే సౌమ్య (17) ఇంటర్ వరకు చదివింది. ఆమె తండ్రి కృష్ణ కూరగాయల వ్యాపారి. మంగళవారం సౌమ్య కుటుంబ సభ్యులు మార్కెట్ వెళ్లారు. ఎవరూలేని సమయంలో ఆమె ఫ్యాన్ కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఇంటి పక్కన ఉండే బంధువులు గమనించి కృష్ణకు సమాచారం అందించారు. కాగా సౌమ్య ఇంటర్‌లో ఒక సబ్జెక్టు ఫెయిల్ కావడంతో మనస్తాపంతో మృతిచెందినట్లు స్థానికులు భావిస్తున్నారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ములుగు(గజ్వేల్): ములుగు రాజీవ్‌రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందినట్లు ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ములుగు గ్రామానికి చెందిన చెట్టి దశరథ్‌గౌడ్(65) టీవీఎస్ వాహనంపై ఉదయం రెవెన్యూ కార్యాలయానికి వెళ్తుండగా హైదరాబాద్ నుంచి సిద్దిపేట వైపు వస్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దశరథ్‌గౌడ్ కాళ్లు విరిగి తలకు బలమైన గాయాలయ్యాయి. అతన్ని లక్ష్మక్కపల్లి ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. కారు డ్రైవర్ శివానందరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.



దశరథ్‌గౌడ్ (ఫైల్)